సాక్షి
మహబూబాబాద్
శనివారం | 3 | ఫిబ్రవరి | 2024



ఆర్థిక సంక్షోభం పెరుగుతుంది

ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం పెరుగుతుందని, దీని ప్రభావం మన దేశంపై తీవ్రంగా ఉందని సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత అన్నారు. - 8లో



మేడారంలో శాశ్వత సెల్ టవర్

మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో శాశ్వత ఎయిర్‌టెల్ టవర్‌ను ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.2°/18.9°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



కేసముద్రం: మండలంలోని కేసముద్రం, కేసముద్రం విలేజ్, ఉప్పరపల్లి, కోమటిపల్లి గ్రామాల్లోని జెడ్పీ హైస్కూల్స్, కస్తూర్బాగాంధీ పాఠశాలను డీఈఓ రామారావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల సమయంలో భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ఉండాలన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా క్రమశిక్షణతో చదవాలన్నారు. ది రైల్వేమెన్ సినిమా క్లిప్పింగ్ చూపించి భోపాల్‌గ్యాస్ దుర్ఘటనపై ఆయన విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైళ్ల హాల్టింగ్ పొడిగింపు

డోర్నకల్: ఆరు నెలల క్రితం పునరుద్ధరించిన రెండు రైళ్ల హాల్టింగ్‌ను పొడగిస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం, బీదర్ మధ్య నడిచే మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్(రైలు నంబర్ 12749, 12750), కాకినాడ, సికింద్రాబాద్ మధ్య నడిచే గౌతమి ఎక్స్‌ప్రెస్(12737, 12738) రైళ్లకు డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్‌ను పొడిగించనున్నారు. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

డ్రైవర్లకు ప్రశంస పత్రాల పంపిణీ



మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ వాహనాల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లకు ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ శుక్రవారం ప్రశంసపత్రాలను పంపిణీ చేశాం ప్రతీ సంవత్సరం మాదిరిగానే వాహన మెయింటెనెన్స్‌లో ప్రతిభ చూపిన డ్రైవర్లకు ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, ఆర్ఐ సోములు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 28న జిల్లాస్థాయి చిత్రలేఖనం, కవితలు, పద్యాలు, పాటలు, వక్తృత్వ, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని జిల్లా సైన్స్ అధికారి అప్పారావు శుక్రవారం తెలిపారు. ఈ పోటీలకు అన్ని పాఠశాలల యాజమాన్యాల విద్యార్థులు అర్హులని, ప్రతీ పాఠశాల నుంచి ఒక్కో అంశానికి ఒక విద్యార్థి మాత్రమే అర్హులన్నారు. అలాగే వ్యర్థాలను తగ్గించడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించడం, సుస్థిరమైన ఆహారాన్ని అనుసరించడం, ఆరో గ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం , ఒకసారి ఉపయోగించిన ప్లాస్టిక్‌ను నిషేధించడం, నీటిని పొదుపు చేయడం, ఇంధనాన్ని అదుపు చేయడం వంటి ఉప అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల ఈ నెల ఐదో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9849 598281 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్

మహబూబాబాద్ రూరల్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పోలీసుశాఖ పని చేస్తోందని, ఇతర శాఖల సహకారంతో ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహించి అనేక మంది బాలకార్మికులకు విముక్తి కల్పిస్తున్నామని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య నేతృత్వంలో 58మంది బాలకార్మికులకు విముక్తి కల్పించామన్నారు. ఇందులో 12 మంది అమ్మాయిలు, 46 మంది బాలురు ఉన్నారన్నారు. వారిని సీడబ్ల్యూసీ, డీసీపీఓకు అప్పగించామని, తదుపరి చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపర్చి పిల్లలు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న 38మంది యజమానులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్ఎస్సై సునంద (మహబూబాబాద్ బృందం), ఎస్సై మౌలానా (తొర్రూరుబృందం)కు ప్రశంసపత్రాలు అందజేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే వెంటనే డయల్ 100 లేదా1098 చైల్డ్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

మోయలేని భారం!

'మహబూబాబాద్ మండలం లక్ష్మీపురంతండా పంచాయతీలో రూ. 5లక్షలతో ట్రాక్టర్, డబ్బా, రూ.1.80లక్షలతో ట్యాంకర్‌ను బ్యాంకు నుంచి రుణం తీసుకొని కొనుగోలు చేశారు. ఇందుకు నెలకు రూ.11వేల చొప్పున మూడు నెలలకు రూ.33వేలు చెల్లించారు. అనంతరం ఆర్థిక సమస్యతో కిస్తీలు చెల్లించలేదు. దీంతో బ్యాంకు అధికారులు వడ్డీ, ఫైన్ వేశారు. ఆ తర్వాత కొన్ని కిస్తీలు చెల్లించారు. అయితే ఇప్పటి వరకు అప్పు తీరలేదు. ఇంకా రూ.2లక్షల అప్పు ఉందని అధికారులు చెబుతున్నారు. ఒక వైపు బ్యాంకు కిస్తీలు, మరోవైపు డీజిల్ భారం, మరమ్మతులకు వేల రూపాయలు వెచ్చించలేక రెండు నెలలుగా ట్రాక్టర్‌ను పక్కనబెట్టారు.'

నిర్వహణభారంతో నిరుపయోగంగా మారిన ట్రాక్టరు, డబ్బా



సాక్షి పరిశీలన

గ్రామ పంచాయతీ ట్రాక్టర్లు, ట్యాంకర్ల నిర్వహణలో ఇబ్బందులు

- చిన్న జీపీల్లో కిస్తీలు, డీజిల్ ఖర్చులతో కుస్తీ
- మరమ్మతులు చేయడంలోనూ జాప్యం
- ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం
- బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు
- ప్రస్తుతం మెయింటెనెన్స్‌పై తర్జనభర్జన



మరమ్మతులు చేపట్టకపోవడంతో మూలకు పడిన కొత్తరు(సీ) పంచాయతీ వాటర్ ట్యాంకర్

సాక్షి, మహబూబాబాద్: పల్లెల్లో పరిశుభ్రత, పచ్చదనం వెల్లివిరియాలనే ఆలోచనతో గ్రామ పంచాయతీలు ట్రాక్టర్లు, డబ్బాలు, ట్యాంకర్లు కొనుగోలు చేశాయి. బ్యాంకుల నుంచి రుణం తీసుకుని కొనుగోలు చేసిన వాహనాలను చెత్త సేకరణ, హరితహారంలో నాటిన మొక్కలకు నీరు అందించడం, ఇతర పనులకు వినియోగిస్తున్నారు. పెద్ద పంచాయతీలు, నిధులు ఉన్న, అధిక పన్నులు వసూళ్లు చేసే జీపీల్లో వాటి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు. చిన్న పంచాయతీల్లో నిర్వహణ భారంగా మారింది. సరైన డ్రైవర్ లేక కొన్ని, డీజిల్‌కు డబ్బులు లేక మరికొన్ని, చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయించలేక కొన్ని.. ఇలా పలుచోట్ల ట్రాక్టర్లను, డబ్బాలను, ట్యాంకర్లను మూలన పడేశారు. కాగా ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగియడం.. ప్రత్యేకాధికారుల చేతుల్లోకి పంచాయతీలు వెళ్లడంతో వాహనాల నిర్వహణపై తర్జనభర్జన పడుతున్నారు. కాగా శుక్రవారం 'సాక్షి' పలు గ్రామాలను సందర్శించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

అప్పులు చేసి కొనుగోలు చేసి..

జిల్లా వ్యాప్తంగా 461 గ్రామ పంచాయితీల్లో పలు కంపెనీల ధరల ఆధారంగా ఒక్కో ట్రాక్టర్‌ను రూ.5లక్షల నుంచి రూ.7లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. అయితే ఇందులో పెద్ద పంచాయతీలు, ఆదాయ వనరులు ఉన్న జీపీలు ఒకే సారి నగదు చెల్లించి కొనుగోలు చేశాయి. చిన్న పంచాయతీలు, తండాల పంచాయతీలు బ్యాంకు రుణాలు తీసుకొని కొనుగోలు చేశాయి. ఈక్రమంలో పలువురు అధికారులు ట్రాక్టర్ కంపెనీల డీలర్లతో కుమ్మక్కై ఉన్న ధరకన్నా అదనంగా రేటు వేసి కమీషన్లు తీసుకున్నారనే ఫిర్యాదులు వచ్చాయి. అయితే వచ్చీరాని పన్నులు, నిధుల లేమితో నెలనెలా బ్యాంకులకు కిస్తీలు కట్టేందుకు సర్పంచ్‌లు నానా అవస్థలు పడేవారు. ఇలా జిల్లాలో ఇప్పటి వరకు 36పంచాయతీలు తీసుకున్న ట్రాక్టర్ల కిస్తీలు పూర్తిగా చెల్లించగా.. మిగిలిన పంచాయతీల్లో అప్పుల కుప్పలు అలాగే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

భారంగా నిర్వహణ..

జిల్లాలోని 461గ్రామ పంచాయతీల్లో 290మేరకు తండాలు, చిన్నచిన్న గూడేలు జీపీలుగా ఉన్నాయి. ఈ పంచాయతీలకు వచ్చే రాష్ట్ర నిధులు, 15వ ప్రణాళిక నిధులు జీపీల నిర్వహణ, వర్కర్లు, కరెంట్ బిల్లులు చెల్లింపులకే సరిపోతున్నాయి. ఇక ట్రాక్టర్లకు నెలకు రూ.11వేల చొప్పున కిస్తీలు చెల్లించడానికి ఇబ్బందులు పడాల్సిందే. వీటికి తోడు గ్రామాల్లో చేపట్టిన డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, సీసీరోడ్ల నిర్మాణాలకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో బిల్లులు రాలేదు. దీంతో అప్పుల్లో కూరుకుపోయిన సర్పంచ్‌లకు ట్రాక్టర్ల కిస్తీలు, నిర్వహణ, మరమ్మతుల ఖర్చులు అదనపు భారంగా మారడంతో వాటిని మూలన పెట్టారు. అయితే సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో.. ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేట్టారు. కాగా పంచాయతీల పాలన, ట్రాక్టర్ల నిర్వహణపై అధికారులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్ నిర్వహణ భారంగా మారింది



గ్రామంలో ట్రాక్టర్ నిర్వహణ భారంగా మారింది. గ్రామ పంచాయతీ నుంచి ట్రాక్టర్ ఫైనాన్స్ కిస్తీల చెక్కులను సకాలంలో అందించినా ట్రెజరీలో పాస్‌కాక పెనాల్టీలు పడుతున్నాయి. పెనాల్టీ డబ్బులు కట్టడం కష్టంగా ఉంటుంది. మరమ్మతులు, డీజిల్ బిల్లులను ముందస్తుగా సర్పంచ్‌లే చెల్లించాలి. తిరిగి బిల్లులు రావడం కష్టమవుతుంది. గత ఏడాది నుంచి స్టేట్ ఫైనాన్స్ నిధులు జీపీలకు రావడంలేదు. కేంద్రం నిధులు వస్తే అందులోనుంచి ట్రాక్టర్ కిస్తీలు, ఇతర ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. ట్రాక్టర్ నిర్వహణ సర్పంచ్‌లకు ఇబ్బందిగా మారింది.

- గంగాధర్ రెడ్డి, మాజీ సర్పంచ్, కొత్తూరు(సీ), సీరోలు

మరమ్మతులకు వేలకువేలు ఖర్చు..



ప్రభుత్వం మా గ్రామానికి ట్రాక్టర్, డబ్బా, ట్యాంకర్ కేటాయించినప్పటికీ దానికి ఉన్న బ్యాటరీ తరచూ పాడైపోతుండడంతో నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతీ నెల ట్రాక్టర్ ఈఎంఐ రూ. 11వేల చొప్పున చెల్లించాల్సి ఉండగా.. జీపీ ఖాతాలో నిధులు లేని సమయంలో వడ్డీ పడుతుంది. ఈ కారణంగా మా ఖాతాకు సంబంధించిన సిబిల్‌స్కోర్ కూడా తగ్గిపోతుంది.

- భూక్య సింధుభాస్కర్, మాజీ సర్పంచ్, లక్ష్మీపురంతండా, మహబూబాబాద్

ట్రాక్టర్లు పనిచేసేలా చూస్తాం



పంచాయతీల్లో చెత్త సేకరణ, మొక్కల పెంపకం కీలకం. ఇందుకోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లు తప్పకుండా నడిపించాలి. ఇప్పటి వరకు పలువురు సర్పంచ్‌లు ట్రాక్టర్లకు మరమ్మతులు చేయించలేక మూలన పెట్టినట్లు తెలిసింది. ఇక నుంచి ట్రాక్టర్ల నిర్వహణను ప్రత్యేకాధికారులు చూసుకుంటారు. అవి పనిచేసేలా మరమ్మతులు చేయిస్తారు.

- హరిప్రసాద్, డీపీఓ, మహబూబాబాద్

ఈ–శ్రమ్ భరోసా



- అసంఘటిత కార్మికుల కుటుంబాలకు అండ
- ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా ప్రయోజనం

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) పథకాన్ని ప్రవేశపెట్టింది. వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు మరణించిన, శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి బీమా సౌకర్యం కల్పిస్తోంది. ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులు పథకానికి అర్హులు. ఇప్పటివరకు 1.35లక్షల మంది కార్మికులు నమోదు చేసుకున్నారు. కాగా నమోదు చేసుకున్న కార్మికులు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.2లక్షలు, శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తోంది. 2021లో ఈ శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించగా.. 26 ఆగస్టు 2021నుంచి 31 మార్చి 2022 లోపు ప్రమాదం జరిగి నష్టపోయిన కార్మిక కుటుంబాలకు మొదటి విడతగా ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు కార్మికశాఖ అధికారులు చెబుతున్నారు.

అర్హులు వీరే..

వ్యవసాయ అనుబంధ రంగాలు, రవాణా రంగం, చేతివృత్తులు, స్వయం ఉపాధి, సేవారంగం, హమాలీ, ఆహార పరిశ్రమల్లో పని చేసే 18నుంచి 59 సంవత్సరాల వయసు లోపు కకార్మికులు పథకానికి నమోదు చేసుకోవచ్చు. అలాగే ఆదాయ పన్ను పరిధిలోని రానివారు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేని అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులందరూ అర్హులే. మీసేవ కేంద్రాల్లో ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌తో పాటు నామిని వివరాలతో నమోదు చేసుకోవచ్చు. కాగా కార్మికుడు మృతిచెందితే క్లెయిమ్ కోసం మరణ ధ్రువీకరణపత్రం, ఆధార్, ఈశ్రమ్‌కార్డు, ఎఫ్ఐఆర్ పత్రం, పంచనామా, పోస్టుమార్టం రిపోర్టు, నామి ని బ్యాంక్ అకౌంట్ వంటి వివరాలను కార్మికశాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.

కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి



అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదై మరణించిన లేదా శాశ్వత వైకల్యం కలిగిన కార్మికులు, కుటుంబ సభ్యులు నేరుగా కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. మొదటి విడతగా ప్రభుత్వం అందిస్తున్న బీమా కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలి.

- జగదీశ్‌కుమార్, జిల్లా సహాయ కార్మిక కమిషనర్

సమగ్ర నివేదిక అందజేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, కేంద్రాల సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్‌తో కలిసి ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను అధికారులు సందర్శించి కావాల్సిన వసతులను నివేదికలో పొందుపర్చాలన్నారు. ప్రస్తుతం ఉన్న వసతులను నమోదు చేసి నివేదిక అందజేయాలన్నారు. అత్యధిక ఓటింగ్ శాతం నమోదుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా నివేదికను తయారు చేసి ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సవ్ టొప్పో, డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు, డీఆర్‌డీఓ సన్యాసయ్య, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కార్మిక, రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించాలి



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నెహ్రూసెంటర్: కార్మిక, రైతు వ్యతిరేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ఏకం కావాలని ఐక్య కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ పాలనలో నిరుద్యోగం, ఆకలి చావులు, పేదరికం పెరిగిపోయిందన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ రంగాలకు అనుకూల చట్టాలు తీసుకొస్తూ.. ప్రభుత్వరంగ సంస్థలను విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందని ఆరోపించారు. ఉపాధిహామీ, కార్మిక చట్టాల రద్దు చేసి కార్మికులను బానిసలుగా మార్చే కుట్రలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను ప్రజలు, కార్మికులు, ప్రజాస్వామికవాదులు ఏకమై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సీతారామయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు కొత్తపల్లి రవి, బీఆర్‌టీయూ నాయకులు మంగళపల్లి రాజ్‌కుమార్, నాయకులు రాజు, ఎస్‌కె మధార్, హెచ్ లింగ్యా, పర్వత కోటేష్, సారిక శ్రీనివాస్, శివ్వారపు శ్రీధర్, కుంట ఉపేందర్, కుమ్మరికుంట్ల నాగన్న పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయండి



ఆడిటోరియాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మరిపెడ: రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని రామావిలాస్ వీధి రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక ఆడిటోరియాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... పట్టణంలో రామావిలాస్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆడిటోరియంతో పాటు పార్కులు ఏర్పాటు చేయడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. స్థానిక వ్యాపారులు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, సిబ్బంది ఉన్నారు.

ప్రజా సేవకు విరామం లేదు



సభలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రమాదేవి

కురవి: ప్రజాసేవ చేసే వారికి విరామం లేదని, పదవికే విరమణ ఉంటుందని జెడ్పీ సీఈఓ రమాదేవి అన్నారు. శుక్రవారం కురవి ఎంపీడీఓ కార్యాలయంలో ఉమ్మడి కురవి మండలంలోని సర్పంచ్‌లకు ఆత్మీయ వీడ్కోలు, సన్మాన కార్యక్రమం ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్ అధ్యక్షతన జరిగింది. సర్పంచ్‌లను సన్మానించి మెమెంటోలు ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. ప్రజల మన్ననలు పొందిన సర్పంచ్‌లు మరోమారు పోటీ చేసి విజయం సాధించాలని సూచించారు. ఐదేళ్ల పరిపాలన ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయని, చెరిగిపోని విధంగా పాలన చేసిన వారు చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పదవీ విరమణ పొందిన అందరూ ప్రజలకు నిత్యం సేవలందించాలని కోరారు. జెడ్పీటీసీ వెంకటరెడ్డి, ఎంపీడీఓ సరస్వతి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జూరి ఉమాపిచ్చిరెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య, ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఏపీఓ యాకాంబ్రం, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చూపు.. ఎంపీ ఎన్నికల వైపు!

- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు.. డీసీసీల నుంచి టీపీసీసీకి జాబితా
- వరంగల్‌ల స్థానానికి 52కు చేరిన ఆశావహుల సంఖ్య
- పోటాపోటీగా ఏఐసీసీకి దరఖాస్తులు
- వ్యూహాత్మక ఎత్తుగడలతో కాంగ్రెస్ సన్నద్ధం
- టికెట్ కోసం 'గాడ్‌ఫాదర్'ల చుట్టూ ప్రదక్షిణ







వరంగల్ లోక్‌సభ టికెట్‌కోసం దరఖాస్తు చేస్తున్న నమిండ్ల శ్రీనివాస్, కూరాకుల భారతి, కొప్పుల రాజుకు బయోడేటా చూపుతున్న డాక్టర్ రామకృష్ణ

సాక్షిప్రతినిధి, వరంగల్: లోక్‌సభ ఎన్నికల దిశగా ప్రధాన పార్టీలు అడుగులేస్తున్నాయి.. గతేడాదిలో జరిగిన శాసనసభ ఎన్నికల తరువాత పార్టీ పరిస్థితిని క్షేత్రస్థాయిలో అంచనా వేస్తూనే లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడంపై ఆయా పార్టీల అధిష్టానాలు దృష్టి సారించాయి. ఉమ్మడి వరంగల్ విషయానికొస్తే అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ముమ్మరం చేసింది. 12 అసెంబ్లీ నియోజకవర్గాలు.. రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్నాయి. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో వరంగల్ తూర్పు, పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలుండగా.. మహబూబాబాద్ పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు, భద్రాచలం, ఇల్లందు, పినపాక నియోజకవర్గాలున్నాయి. బీఆర్‌ఎస్ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకుంటుండగా.. కాంగ్రెస్ ఏకంగా అభ్యర్థుల ఎంపిక కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. శుక్రవారం నాటికి కాంగ్రెస్ పార్టీ ఆశావహుల సంఖ్య 52కు చేరగా.. ఇంకా వీరి నంబర్ పెరిగే అవకాశం ఉందని పార్టీవర్గాల సమాచారం.

వరంగల్ కోసం పోటాపోటీ..

రాష్ట్రంలో అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీకి ఈ లోక్‌సభ ఎన్నికలు సవాల్‌గా మారబోతున్నాయి. ఈ నేపథ్యంలో గెలుపు గుర్రాలను ఎంపిక చేయడమే లక్ష్యంగా ఆ పార్టీ అధిష్టానం పావులు కదుపుతోంది. ఉమ్మడి వరంగల్ రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఎక్కువ ఎమ్మెల్యేలు ఈ పార్టీ నుంచి గెలవడంతో ఎట్టి పరిస్థితుల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడంపై ఆ పార్టీ దృష్టి పెట్టింది. ఇదే అదునుగా ఆ పార్టీలో వివిధ స్థాయిల్లో ఉన్న కార్యకర్తలు, నాయకులు పోటాపోటీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, టీడీపీ, బీజేపీలనుంచి పోటీ చేసి అత్యధిక ఓట్లు సాధించి కాంగ్రెస్ పార్టీలో చేరిన రామగళ్ల పరమేశ్వర్, జాతీయ నాయకులు అద్దంకి దయాకర్, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, సింగాపురం ఇందిర, నమిండ్ల శ్రీనివాస్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా అధికారి హరికోట్ల రవితో పాటు పలువురు వరంగల్ ఎంపీ టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి ఆశిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ లేబర్ డిపార్ట్‌మెంట్ కూరాకుల భారతి, హరికోట రవి తరపున తన అనుచరులు, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ జువాలజీ విభాగంలో గెస్ట్‌ఫ్యాకల్టీగా పని చేస్తున్న అధ్యాపకుడు డాక్టర్ పొడేటి కోటేశ్వర్‌రావు గాంధీభవన్‌లో దరఖాస్తు చేశారు. కాంగ్రెస్ జాతీయ ఎస్సీ, ఎస్టీ సెల్ చైర్మన్ కొప్పుల రాజును న్యూఢిల్లీలో డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కలిసి తన బయోడేటాను అందించారు. ఇప్పటివరకు 52 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు తెలిపారు.

అధిష్ఠానం ఆశీస్సులు దక్కేదెవరికో..

పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. ఎంపీ స్థానాలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి పార్టీ జిల్లా కమిటీల అధ్యక్షులతో పాటు సీనియర్ నేతల అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వం పక్షాన ఇంటెలిజెన్స్ అధికారులు కూడా ఇప్పటివరకు దాఖలైన దరఖాస్తులపై ఆరా తీస్తున్నారు. వరంగల్ పార్లమెంట్ నుంచి టికెట్ ఆశించే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. కొందరు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా త్యాగం చేశామని, తమకు పార్టీ అవకాశం ఇస్తుందనే ఆశాభావంతో ఉన్నారు. 2018లో పోటీచేసి ఓటమి చెందిన దొమ్మాటి సాంబయ్యతో పాటు పలువురు సీనియర్లు కూడా ఇదే వరుసలో ఉన్నారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడైన అద్దంకి దయాకర్‌ను పార్టీ వరంగల్ బరిలో దింపే అవకాశాలున్నాయని పార్టీ సీనియర్లు ఇప్పటికే చెబుతున్నారు. ఆయనను మొదట ఎమ్మెల్సీ అభ్యర్థిగా అనుకున్నా.. చివరి నిమిషంలో తప్పించారంటున్నారు. వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రెండు రోజుల కిందట ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కలిసి పార్లమెంట్ టికెట్‌ను ఆశిస్తున్నట్లు తెలియజేశారు. ఎవరికీ వారుగా ప్రయత్నిస్తుండగా.. అధిష్ఠానం ఆశీస్సులు ఎవరికి దక్కుతాయనేది చర్చనీయాంశంగా మారింది.

పోలీసుల విస్తృత తనిఖీలు

కొత్తగూడ: కొత్తగూడ, గంగారం మండలాల్లో ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసులు బాంబ్, డాగ్‌స్క్వాడ్ విస్తృత తనిఖీలు చేపట్టారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులు, ప్రజాప్రతినిధులకు సంఘ విద్రోహశక్తుల నుంచి ఎలాంటి హాని కలుగొద్దనే ఉద్దేశంతో ఏజెన్సీ గ్రామాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. భూపతిపేట నుంచి గుంజేడు మీదుగా కొత్తగూడ మండలకేంద్రం వరకు, ముస్మి నుంచి దుబ్బగూడెం వరకు దారిలో ఉన్న అన్ని కల్వర్టులను తనిఖీ చేశారు. కాగా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు పడిగ మేడారం చేరుకుంటుంది. ఈమేరకు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు పలుమార్లు ఈ ప్రాంతంలో సందర్శించాల్సి ఉంటుంది. కాగా పూనుగొండ్ల అటవీప్రాంతం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు తనిఖీలు చేపడుతున్నారు.



కల్వర్టు వద్ద బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు

క్లుప్తంగా

బస్సులో పాట పాడిన 'బలగం' ఫేమ్



బస్సులో పాట పాడుతున్న కొమురమ్మ

నర్సంపేట: కుటుంబంలోని బంధుత్వాలు, ప్రేమానురాగాలను కళ్లకు కట్టినట్లు చూపించి సంచలనం సృష్టించిన బలగం సినిమాలో తోడుగా మాతోడుండి.. నీడగా మాతో నడిచి... అంటూ తన గానంతో ఆకట్టుకున్న బలగం గాయకురాలు దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం కొమురమ్మ. శుక్రవారం ఈమె ఆర్టీసీ నర్సంపేట డిపోకి చెందిన బస్సులో ప్రయాణం చేస్తూ బలగం ఆ పాట పాడి ప్రయాణికులను అలరించింది. గొర్రెకుంట నుంచి లక్నెపల్లి వరకు ప్రయాణం చేసిన ఆమె కండక్టర్ గొలనకొండ వేణు, ప్రయాణికుల కోరిక మేరకు పాట పాడారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

వరంగల్: యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్‌పూర్‌లోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, భోజన వసతితోపాటు ఉద్యోగం కల్పించబడుతుందని సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, ఆటోమొబైల్–టూ వీలర్ సర్వీసింగ్, ఎలక్ట్రిషియన్(గృహ), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్, సర్వీస్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, 18–35మధ్య వయస్సు, గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈశిక్షణలో చేరే ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 7వ తేదీ ఉదయం 10గంటలకు హాజరు కావాలని, ఇతర వివరాలకు 91339 08000, 99484 66111 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

బాలికపై లైంగికదాడి

● ఒకరి రిమాండ్

రేగొండ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌ను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక వరంగల్‌లోని కేఎంసీ దగ్గరలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తుంది. ఈ క్రమంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన యువకుడు రహీద్‌ఖాన్ ప్రేమ, పెళ్లి అంటూ వెంటపడి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు.పెళ్లి చేసుకోమంటే బాలికను బెదిరించడంతో తన తల్లికి విషయం తెలిపింది. రేగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. చిట్యాల సీఐ వేణు చందర్ ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



మేడారంలో శాశ్వత సెల్ టవర్

● ప్రారంభించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



టవర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారంలో శాశ్వత సెల్ టవర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ప్రారంభించారు. మేడారం జాతర సందర్భంగా ఎయిర్‌టెల్ సేవలు అందించడం కోసం శాశ్వతంగా ఏర్పాటు చేసిన 3 ఎయిర్‌టెల్ టవర్లను ఇండస్ టవర్స్ సీఈఓ దిలీప్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేడారం ప్రాంతంలో ఎయిర్‌టెల్ సేవలు అందించేందుకు మేడారం, ఎల్బాక, ప్రాజెక్ట్‌నగర్ ప్రాంతాల్లో మూడు టవర్లను ఏర్పాటు చేశారని, నిరంతరం భక్తులకు ఎయిర్‌టెల్ సేవలను అందించేందుకు సంస్థ కృషి చేస్తుందన్నారు. కంపెనీ సీఈఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు మేడారం ప్రాంతంలో శాశ్వత ప్రాతిపాదికన మూడు టవర్లను ప్రారంభించామని, వీటితో పాటు జాతర సమయంలో 12 తాత్కాలిక ఎయిర్‌టెల్ టవర్లు ఏర్పాటు చేసి భక్తులకు సేవల అందిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ హరితహోటల్‌లోని మరమ్మతుల పనులను పరిశీలించారు. ఊరట్టం నుంచి కాల్వపల్లి బైపాస్, కొంగలమడుగు నుంచి చింతల్‌క్రాస్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వెంకయ్య, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, తహసీల్దార్ రవీందర్, ఎయిర్‌టెల్ ఏరియా మేనేజర్ రమేష్‌బాబు, సుగుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజుకే తారులేసింది..

● నాణ్యతాప్రమాణాలు పాటించని వైనం
● అతుకులుగా బీటీ నిర్మాణం



తారు లేసిన రోడ్డు



ఎగుడుదిగుడుగా కనిపిస్తున్న రహదారి

మేడారం ముచ్చట్లు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారంలో వేసిన రోడ్డు ఒక్కరోజుకే తారులేసిపోయింది. సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మేడారం శివరాంసాగర్ చెరువు నుంచి తాడ్వాయి మధ్యలో రోడ్డుపై బీటీ నిర్మాణం జరుగుతుంది. ప నుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించడంతో రోడ్డు పూర్తిగా అతుకులుగా కనిపిస్తుంది. సంబంధిత శా ఖ ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు చే యిస్తున్నా.. నాణ్యత లోపించడంతో అనుమానాల కు తావిస్తుంది. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మంత్రి సీతక్క ఆదేశించినా అ ధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం.

వేస్తుంటేనే లేస్తున్న తారు..

బీటీ రోడ్డు నిర్మాణ పనులు ఎంతో అరుదుగా ఉంటాయి. బీటీ రోడ్డుపై తారు వేస్తే నున్నగా కనిపిస్తుంది. నూనె పోసినా ఎత్తుకునేలా రోడ్డు నిర్మాణం ఉంటుందని సామెత కూడా.. కానీ.. మేడారంలో మాత్రం తారురోడ్డు నిర్మాణం పనులు నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపిస్తున్నాయి. రోడ్డు మధ్యలో ఎత్తు వంపులుగా కనిపించడం, వేసిన ఒక్క రోజుకే వాహనాల తాకిడికి తారు లేసిపోయి కనిపిస్తుంది. వాహనాల తాకిడికి తారు లేసి.. అసలు రోడ్డు వేశారా.. అనే అనుమానం కలిగేలా పనులు ఉన్నాయి..

పగిడిద్దరాజు ఆలయ సందర్శన



ఆలయ ప్రాంగణంలో అధికారులు

గంగారం : మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా సమ్మక్క భర్త అయిన పగిడిద్దరాజు ఆలయం ఉన్న పూనుగొండ్ల గ్రామాన్ని శుక్రవారం గూడూరు సీఐ ఫణిదర్, కొత్తగూడ, గంగారం ఎస్సైలు నగేష్, దిలీప్, ఎంపీడీఓ అపర్ణ, తహసీల్దార్ రాము సందర్శించారు. జాతరకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు, భద్రత అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తుల భద్రతకు సంబంధించి ఎస్సై దిలీప్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఆలయం ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. లా అండ్ ఆర్డర్‌కు సంబంధించి అంశాలపై ఏమైనా ఉంటే పోలీస్‌ల దృష్టికి తీసుకురావాలని ఆలయ కమిటీకి తెలిపారు.

ఆర్థిక సంక్షోభం పెరుగుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

● కేంద్రంలోని బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి
● సీఐటీయూ జాతీయ సమావేశంలో జాతీయ అధ్యక్షురాలు హేమలత

కాజీపేట రూరల్: ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం పెరుగుతోందని, దీని ప్రభావం మన దేశంపైన తీవ్రంగా ఉందని సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాసలో శుక్రవారం సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. జాతీయ సమావేశాలు సూచికంగా హేమలత సీఐటీయూ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పిస్తూ కళాకారులు పాటలు పాడారు. అనంతరం జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలను జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ.. కనీస వేతనాలు ధరలకు అనుగుణంగా పెరుగకపోవడం వల్ల కొనుగోలు శక్తి క్షీణిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు లాభాలు, కార్మికుల వేతనాలు క్షీణించడం ఒక ధోరణిగా మారిందని అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 16న గ్రామీణ భారత్ బంద్ కార్మిక సమ్మెకు కోట్లాది మంది సన్నద్ధమవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ సమస్యలు పరిష్కరించలేక రామాలయ నిర్మాణం భావోద్వేగాల ఆధారంగా 2024 పార్లమెంట్ ఎన్నికల్లో గెలువాలని ప్రయత్నిస్తుందని తెలిపారు. జాతీయ సమావేశాల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగుల భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జి.వెంకటేష్, భూపాల్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఆఫీస్ బేరర్స్ గాదె ప్రభాకర్‌రెడ్డి, మెట్టు రవి, బుట్ల చక్రపాణి, సారంగపాణి, బి.సంపత్, రజిత, వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నల్లబెల్లం స్వాధీనం

● ఒకరిపై కేసు నమోదు

నెల్లికుదురు: అక్రమంగా నిల్వ చేసిన గుడుంబా తయారు చేసే నల్లబెల్లాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన మండలంలోని జామతండా శివారు నిమ్మతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మతండాలో గుడుంబా తయారు చేసే నల్లబెల్లం అక్రమంగా నిల్వ చేసినట్లు నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. తండాకు వెళ్లి గుగులోతు శంకర్ ఇంటిలో సోదాలు చేయగా తరలించడానికి సిద్ధంగా ఉన్న 30 బస్తాల్లోని 15క్వింటాల బెల్లం, 2 బస్తాల్లోని క్వింటా పటిక ఉన్నట్లు గుర్తించారు. రూ.1.60లక్షల విలువ చేసే నల్ల బెల్లం, పటికను స్వాధీనం చేసుకుని అక్రమంగా నిల్వ ఉంచిన గుగులోతు శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేయూ జూడో జట్టు ఎంపిక



క్రీడాకారులతో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య

కేయూ క్యాంపస్: అమృతసర్‌లోని గురునానక్ యూనివర్సిటీలో ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించే సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ జూడో పురుషులు, మహిళల టీంలను ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య వెంకయ్య శుక్రవారం తెలిపారు. పురుషుల జట్టులో టి.శరత్ (వాగ్దేవి డిగ్రీ కాలేజీ, హనుమకొండ), బి.జయదీప్(సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, వరంగల్), టి.భువనేశ్వర్ సింగ్, ఎం.దర్శిత్‌నాయక్(ఎల్‌బీ కాలేజీ, వరంగల్), పి.నాగేంద్ర (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, హనుమకొండ), టి.రోషన్‌సింగ్, ఎస్.సంజీవ్ (మాస్టర్జీ డిగ్రీ కాలేజీ, హనుమకొండ)ఉన్నారు.

జూడో ఉమెన్ జట్టు..

ఉమెన్ జట్టులో ఎం.సుప్రియ(యూసీపీఈ, కేయూ), ఎస్.సిరిచందన(కిట్స్, వరంగల్), ఎన్.జాహ్నవి (వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), టి.అంకిత, జి.వాసంతి, ఈ.జ్ఞానాంకిత (టీటీడబ్ల్యూఆర్‌డిసి, ఖమ్మం), డి.నక్షత్ర (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ, వరంగల్ వెస్ట్) ఉన్నారు. ఈ జట్లకు హనుమకొండలోని జాగృతి డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ రాజేష్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తున్న స్థానికులు

వెంకటాపురం(కె): గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మేడు గ్రామానికి చెందిన పుష్పాల రాజు (40) సూరవీడు గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చి గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. కా గా, రాజు కోసం పడవలు, వలల సాయంతో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం మృతదేహం ల భ్యమైంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమి త్తం వెంకటాపురం ఆస్పత్రికి తరలించారు.

మాదిగల మూలాల్లోనే సాంస్కృతిక మనుగడ

● గద్దం సమ్మయ్యకు రూ.2కోట్ల పారితోషికం ఇవ్వాలి
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



అప్పిరెడ్డిపల్లె సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ మాదిగ, పక్కన గద్దం సమ్మయ్య

దేవరుప్పుల : మాదిగల సామాజిక వర్గాల జీవన శైలి మూలాల్లోనే సాంస్కృతిక మనుగడ ఇమిడి ఉందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లిలో ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత గద్దం సమ్మయ్యను శుక్రవారం కళాకారులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో కలిసి మంద కృష్ణ సన్మానించారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధి హామీ చట్ట ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని స్టేట్ డైరెక్టర్ అందె యాకన్న ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం చిందుల విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణమాదిగ మాట్లాడారు. ఎస్సీలపై ఆధారపడి జీవించే చిందులు, డొబ్బర, బైండ్ల తదితర ఉపకులాల అభ్యున్నతి కోసం జనాభా దామాషా ప్రకారం హక్కులు కల్పించే దిశలోనే ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందన్నారు. ఈ క్రమంలో సమ్మయ్య పద్మశ్రీ అందుకోవడం అభినందనీయమని కొనియాడారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొని వారసత్వ కులవృత్తిని నమ్ముకుని జీవనాధారంగా సమ్మయ్య చిందుల కళా ప్రదర్శనలను కొనసాగించే క్రమంలో ఆ కళలను పోషించే సమాజంలో మాదిగలు ఆర్థిక మూలాలు సమకూర్చడంలో కీలకమన్నారు. క్షేత్రస్థాయిలో దారిద్ర్యరేఖ దిగువనున్న ఉపకులమైన చిందులను నిరుపేదలైన దళితులు ఆదరించే తీరును గుర్తించి భారత ప్రభుత్వం సమ్మయ్యకు అత్యున్నత పురస్కారం ఇవ్వడం అభినందనీయమన్నారు. అత్యంత నిరాధరణ, వెనుకబాటుకు గురవుతున్న కళలకు జీవం పోసేలా అట్టడుగు సమూహాన్ని గుర్తించి గౌరవించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పద్మశ్రీ గ్రహీత సమ్మయ్యకు రూ.2కోట్ల రివార్డును అందజేస్తూ హైదరాబాద్ కేంద్రంగా నాటక అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ, గజవెల్లి గణపతి, వీవీ రత్నం, రాగల్ల ఉపేందర్, అందె యాకన్న, ఏసుపాదం, గద్దల కిషోర్, శరత్, రాజశేఖర్, రాజు, ఎడేల్లి సోమశేఖర్, బొట్ల మహేష్, గువ్వల రవి, రవీందర్, జేరుపోతుల సుధాకర్, కుమార్, నగేష్, స్వామినాయక్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

■ 2BHK Flat, 945 sft N/E, 3rd Floor At LB Nagar, Opp: A1 Function Hall, Warangal 25 Lakhs Negotiable. Ph: 7382112623 [HA-13022]

SERVICES

■ శ్రీ బాలాజీ లోన్స్: మార్టిగేజ్ లోన్స్, పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, IT రిటర్న్స్ (GST) చేయబడును. Govt. ఎంప్లాయ్స్‌కి పర్సనల్ లోన్స్ & ప్లాట్స్ ఇప్పించబడును, వరంగల్, 8522825358. [W-788985]

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్ ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

FINANCE SERVICES

■ సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సిబిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226 [W-788988]

BUSINESS OFFER

■ "వరంగల్ జిల్లా ప్రజలకు శుభవార్త" ఇప్పుడు చిన్న పెట్టుబడితో Bussiness చేసి 1,80,000 రూపాయలు సంపాదించుకునే గొప్ప సువర్ణవకాశం, 100% Decentralization, Block Chain సంప్రదించండి. ఫోన్: 6302280020 [H-788194]

WANTED

■ Wanted female telecallers and business associate for Real Estate layouts for details. Contact: 7997777377 [W-788990]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ యువరాజ్ కిరాణంలో పని చేయుటకు కిరాణంలో 3 సం॥ చేసిన అనుభవం గల యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. వరంగల్ లోకల్ వారికి మాత్రమే. సంప్ర॥ అండర్ బ్రిడ్జి దగ్గర, వరంగల్. 9490133696. [WA-7278]

■ Govt (Regd) సంస్థ తరపున Work చేయుటకు సొంత కంప్యూటర్ గలవారు కావలెను. ఇంటి దగ్గరే వర్క్ చేస్తూ 9 to 19K వరకు సంపాదించే అవకాశం. సెల్: 8977429273. [W-788986]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్ /వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233772]

■ ఒమేగా హౌజెర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 20k ఫోన్: 8977639662, 8977639663. [H-793685]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ..

● భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు



మృతిచెందిన మేరమ్మ

నర్సంపేట రూరల్ : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో భార్య మృతిచెందగా, భర్తకు తీవ్రగాయాలైన సంఘటన నర్సంపేట పట్టణంలోని నెక్కొండ రోడ్డులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామానికి చెందిన పస్నూరి మేరమ్మ (45) భర్త బాబు.. టీవీఎస్ చాంప్‌పై పని నిమిత్తం నర్సంపేటకు వచ్చి తిరిగి రాత్రి ఇంటికి వెళ్తున్నారు. నర్సంపేట పట్టణంలోని నెక్కొండ రోడ్డులో మాధన్నపేట పెద్ద కాలువ సమీపంలోకి రాగానే వెనకాల నుంచి మరో ద్విచక్రవాహనం వచ్చి వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో మేరమ్మ, బాబులు కింద పడిపోయారు. తలకు తీవ్రగాయాలై మేరమ్మ అక్కడికక్కడే మృతిచెందగా బాబుకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం వార్త తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మేరమ్మ మృతదేహాన్ని అంబులెన్స్‌లో పోస్టుమార్టానికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తామని ఎస్సై శీలం రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరోకరికి తీవ్రగాయాలు



మృతి చెందిన రాబిన్

గార్ల: కారు–బైక్ ఢీకొన్న ఘటనలో మానుకోటి జిల్లా గార్లకు చెందిన యువకుడు మృతిచెందగా, మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. గురువారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్లలోని ఇందిరానగర్‌కు చెందిన వల్లభదాసు రమేష్ కుమారుడు రాబిన్(24) బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గార్లకు చెందిన మరో యువకుడు ఆకారపు హరిచరణ్ ఇటీవల హైదరాబాద్ వెళ్లి ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. ఇరువురు కలిసి హైదరాబాద్‌లో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా, బైక్– కారు ఢీకొనడంతో రాబిన్ అక్కడికక్కడే మృతిచెందగా, హరిచరణ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రైలు ఢీకొని వ్యక్తి ..

కాజీపేట రూరల్: కాజీపేట –పెండ్యాల రైల్వే స్టేషన్ల మధ్యని కుమ్మరిగూడెం రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం ఒక వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.సాయిప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. కాజీపేట మండలం రాంపేటకు చెందిన చల్ల కుమారస్వామి (43) కుమ్మరిగూడెం రైల్వే గేట్ సమీపంలో పట్టాలు దాటుతుండగా కాజీపేట–సికింద్రాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

ఆత్మహత్యకు కారకులైన ముగ్గురికి జైలు

● ఇద్దరికి జరిమానా

వరంగల్ లీగల్: మానసిక, శారీరక వేధింపులకు గురిచేసి ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారకులైన భార్య, బావమర్ది, అత్తకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల చొప్పున జరిమానా, వారికి సహకరించిన ఇరువురికి రూ.4వేల జరిమానా విధిస్తూ శుక్రవారం హనుమకొండ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు తీర్పు వెల్లడించారు. నగరంలోని దర్గా కాజీపేటకు చెందిన బీ.సురేష్‌కు కాశిబుగ్గకు చెందిన గోరంటల కృష్ణవేణికి 2016 ఏప్రిల్ 20న వివాహం జరిగింది. కృష్ణవేణి తరచూ గొడువపడుతూ పుట్టింటికి వెళ్లేది. పలుమార్లు పంచాయితీలు నిర్వహించి భర్తను మానసికంగా, శారీరకంగా హింసించేది. ఆమె సోదరుడు గోరంటల సురేష్, తల్లి కనకతారా, వారి బంధువులు నాగరాజు, రాజుకుమార్ పలుమార్లు సురేష్‌ను శారీరకంగా హింసించారు. దీంతో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒంటరిగా ఇంట్లో ఉండి మానసికంగా కుంగిపోయి తన చావుకు వీరే కారణమని లిఖిత పూర్వకంగా రాసి 2019 ఫిబ్రవరి 5న రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో సురేష్ సోదరి ఫిర్యాదు మేరకు కాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నేరస్తులు గోరంటల కృష్ణవేణి, బావమర్ది సురేష్, అత్త కనకతారకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల చొప్పున జరిమానా, వారి బంధువులైన మరో ఇద్దరు నేరస్తులు నాగరాజు, రాజ్‌కుమార్‌లు రూ.4వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి శ్రీనివాస్‌లు తీర్పు వెల్లడించారు.

రక్షణ డిజైన్‌లో శక్తిని ఆదా చేయాలి

● శాస్త్రవేత్త జి. విజయ దుర్గ



అతిథులను సన్మానిస్తున్న కిట్స్ పాలకవర్గ సభ్యులు

హసన్‌పర్తి: రక్షణకు సంబంధించిన డిజైన్‌లో శక్తిని ఆదా చేయాలని సెంటర్ ఇమారత్, డీఆర్‌డీఓ, హైదరాబాద్ శాస్త్రవేత్త విజయ దుర్గ సూచించారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కిట్స్ స్టూడెంట్స్ చాప్టర్, కిట్స్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో 'సమశోధిని' కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి విజయ దుర్గ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. న్యూరల్ నెట్‌వర్క్‌ల కోసం ఆర్కిటెక్చర్, వీఎల్‌సీఐ–డీఎస్పీల పనితీరుతో కూడిన కొరోటజీ వంటి ప్రాథమిక బ్లాక్‌లు, రోబోటిక్స్ అప్లికేషన్స్, హార్డ్‌వేర్‌కు అవసరమైన వినూత్న నైపుణ్యాలను విశదీకరించారు. విద్యార్థులు కోడింగ్, హైలెవెల్ సింథటిస్ స్కిల్స్ గూగుల్ ద్వారా క్లౌడ్ సర్వీస్‌కు సంబంధించిన నైపుణ్యాలు సాధించాలన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, శాస్త్రవేత్త గోపీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఆత్మగౌరవాన్ని సాధించడానికి సానుకూలత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యాలను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని అతిథులను సన్మానించారు. కళాశాల పాలకవర్గ సభ్యుడు రిటైర్డ్ జడ్జి కె.దేవీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ వి.శంకర్, డాక్టర్ పవన్, ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి, ప్రొఫెసర్ పి.రమేష్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి,విద్యార్థి చాప్టర్ ప్రెసిడెంట్ కె.మణిజయంత్, టెక్నికల్ క్లబ్ విద్యార్థి ప్రధాన కార్యదర్శి బి.బద్రినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి చూస్తుండగానే..

బావిలో పడి బాలుడి మృతి

● అగ్నిమాపక సిబ్బంది చొరవతో మృతదేహం వెలికితీత
● మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు



కార్తీక్ (ఫైల్)

నెక్కొండ: బుడిబుడి అడుగులతో ఆడుకుంటున్న బాలుడు తండ్రి చూస్తుండగానే ఓ పాడుపడిన బావిలో పడిపోయాడు. ఒక్కసారిగా ఉలిక్కిపడిన తండ్రి కుమారుడిని కాపాడేందుకు బావిలోకి దిగేందుకు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో బాలుడిని మృత్యువు కబలించింది. ఈ విషాదకరమైన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఎస్సై షేక్ జానీపాషా తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని రామాలయ కాలనీలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బంఫేల్ రజినీ– నోవెల దంపతులు నివాసం ఉంటున్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్లో వీరు పానీపూరి (గప్‌చుప్) బండి నిర్వహిస్తూ.. జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు కార్తీక్ (22 నెలలు) శుక్రవారం ఉదయం ఆడుకుంటున్న క్రమంలో చేదబావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు ఎలాంటి రక్షణ లేని బావిలో పడిపోయాడు. తన కళ్లముందే కుమారుడు బావిలో పడడం చూసిన తండ్రి అందులోకి దిగే ప్రయత్నం చేశాడు. కానీ, ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని బాలుడి ఆచూకీ కోసం ప్రయత్నించారు. వీరి ప్రయత్నాలు విఫలం కావడంతో నర్సంపేట ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది రంగంలో దిగి బాలుడి ఆచూకీకోసం తీవ్రంగా యత్నించారు. ఈక్రమంలో సిబ్బంది విసిరిన ఇనుప చువ్వల కొక్కానికి బాలుడి చొక్కా చిక్కడంతో బయటకు తీశారు. బాలుడి మృతదేహాన్ని చూసిన స్థానికులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, బతుకు తెరువు కోసం వచ్చిన ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకోవడంతో గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.